క్లుప్తంగా

ఉగాది వేడుకలకు సిద్ధం


డాక్టర్ ఎ.గోపాలరావు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉగాది రోజున నిర్వహించే వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. గోపాలరావు తెలిపారు. బుధవారం ఆయన సమాఖ్య కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉగాది రోజున జరిగే కార్యక్రమాలను విజయభావన అధ్యక్షుడు దామరాజు శంకరం అధ్యక్షతన ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు జి.సన్యాసమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారన్నారు. ప్రముఖ రంగస్థల నటుడు, కవి, గాయకుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణకు విజయభావన ఉగాది పురస్కారం అందజేయనున్నట్లు చెప్పారు. సాహితీవేత్తలందరూ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

తప్పుడు మార్గం తగదు

- ఎస్సై సన్యాసినాయుడు


మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

డెంకాడ: జీవితం ఎంతో విలువైనదని.. తప్పుడు మార్గాల వైపు వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని జొన్నాడలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు పలు అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పిల్లలను ఉన్నతంగా చూడాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకోర్చి చదివిస్తున్న సంగతి మరువకూడదన్నారు. చెడు సావాసాలకు దూరంగా ఉండి, ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చని తెలిపారు. బెట్టింగ్‌లు, మాదకద్రవ్యాల జోలికి పోవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల సమయాల్లో మార్పు

విజయనగరం: నగరంలో ఉన్న అన్న క్యాంటీన్ల నిర్వహణ సమయాలలో ఏప్రిల్ 1 నుంచి స్వల్ప మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం ఇప్పటివరకు అల్పాహారం ఉదయం 7.30 గంటల నుంచి 9 వరకు ఉండేదని, తాజా ఉత్తర్వుల మేరకు ఇక నుంచి ఉదయం 7 గంటల నుంచి 8.30 వరకు ఉంటుందన్నారు. అలాగే భోజన సమయం మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు ఉండేదని, ఇప్పుడు 12 గంటల నుంచి 2.30 గంటల వరకు.. రాత్రి అల్పాహారం గతంలో 7.30 గంటల నుంచి 9 వరకు ఉండేదని, ఇకపై 7 గంటల నుంచి 8. 30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులు మార్పును గమనించాలని కోరారు.

పురిటిపెంటలో 104 వైద్యశిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి

గజపతినగరం: మండల కేంద్రంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం–2 పరిధిలో బుధవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి 56 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్యజాగ్రతలపై అవగాహన కల్పించారు. ఎండల తీవ్రత పెరిగిందని, వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సహాయం

వేపాడ: మండలంలోని రాయుడుపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహాయం చేసింది. వంట పాత్రలు, రగ్గులను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి చేతులమీదుగా బుధవారం అందజేశారు. తహసీల్దార్ రాములమ్మ, రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు టి.సూర్యారావు, ఎస్.కోట బ్రాంచ్ చైర్‌పర్సన్ డాక్టర్ వరలక్ష్మి, జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు ఏం.రాము, మన్మధరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ టీఏలకు బదిలీ

గంట్యాడ: ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లకు బదిలీ అయ్యిందని ఏపీఓ సుందరరావు బుధవారం తెలిపారు. టీఏ శంకరరావుకు వేపాడ బదిలీ కాగా ఆయన స్థానంలో గజపతినగరం నుంచి సంతోషికుమారి వచ్చారు. టీఏ శశి, రాధ ఎస్.కోటకు బదిలీ అయ్యారు.వారి స్థానంలో కొత్తవలస నుంచి గంగ, విజయనగరం నుంచి జయకుమారి ఇక్కడికి వచ్చారు. అలాగే ఇంజినీరింగ్ కన్సల్టెంట్ జోగారావుకు వేపాడ కు బదిలీ కావడంతో దెంకాడ నుంచి శంకర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఉపాధిలో బినామీ మస్తర్లు

- వంద రోజుల పని దినాల కల్పనలో నిర్లక్ష్యంపై సిబ్బందికి షోకాజ్ నోటీసులు
- పని ప్రదేశాల్లో బోర్డులు లేకపోవడంపై పీడీ ఆగ్రహం
- మండల కేంద్రంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక


అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: ఉపాధిహామీ పనులలో బినామి మస్తర్లపై సభలో గందరగోళం నెలకొంది. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 28 పంచాయతీలలో జరిగిన సుమారు రూ. 24 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఆడిట్ బృందం ఇచ్చిన నివేదికను సర్పంచ్‌లకు గాని, కార్యదర్శులకు గాని ఇవ్వలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. సామాజిక తనిఖీ సమావేశం తాలూకా సమాచారం కూడా అందజేయకుండా.. ఆయా గ్రామాలలో కనీసం గ్రామ సభలు నిర్వహించకుండా ఇప్పుడు సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహించడం వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమిటని సభలో అసహనం వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన పీడీ శారదాదేవి ఎన్నికల కోడ్ కారణంగా ఆడిట్ బృందం ఇచ్చిన నివేదిక ఇవ్వలేదని, అదేవిధంగా గ్రామసభలు కూడా నిర్వహించలేదని తెలిపారు. 100 రోజుల పని దినాల కల్పనలో ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో పనులు కల్పించలేనప్పుడు ఎందుకున్నారని మండిపడ్డారు. నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. పని ప్రదేశాలలో వేతనదారులకు టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధిహామీ పనులు జరుగుతున్న తీరును ప్రజాప్రతినిధులు కూడా వీలు చూసుకొని పర్యవేక్షించాలని తెలిపారు. పనిచేస్తున్నట్లు భువన్ యాప్ ఫొటోలు అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పనిలో ఐదు శాతం అదనపు కొలతలు ఉన్నట్లు సామాజిక తనిఖీ సమావేశంలో ఆడిట్ బృందం వెల్లడించింది. విశాఖలో ఉంటున్న వ్యక్తుల పేరిట కూడా బత్తివలస ఫీల్డ్ అసిస్టెంట్ బినామి మస్తర్లు వేస్తున్నట్లు సంబంధిత గ్రామస్తులు సభలో ఫిర్యాదు చేశారు. పని ప్రదేశంలో వర్క్‌ఐడీని తెలిపే నేమ్‌బోర్డులు లేకపోవడంపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. సీహెచ్ అగ్రహారం, కోనాడ, కుమిలి గ్రామాలలో చిన్నచిన్న పొరపాట్లు ఉన్నాయని ఆడిట్ బృంద సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక , తహసీల్దార్ తాడ్డి గోవింద, ఏపీఓ రత్నమాల, తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి హోమానికి శ్రీకారం


మేళతాళాలతో మన్నార్ రాజగోపాలస్వామి ఆలయానికి వస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: నగరంలోని కొత్తపేట మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించనున్న ధన్వంతరి నారాయణ హోమానికి బుధవారం రుత్విక్కులు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. 54 హోమగుండాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 60 మంది రుత్విక్కులు 163 మంది దంపతులచే హోమం చేయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ గ్రూప్ ప్రాజెక్ట్ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరప్రసాద్. గూడురు రమేష్, గోపాల్, జగదీష్, కొప్పరపు కృష్ణ, రవ్వా వెంకటేశ్వరరావు, నారాయణం లక్ష్మణరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై టీడీపీ కార్యకర్త దౌర్జన్యం


సచివాలయ ఉద్యోగితో వాగ్వాదానికి దిగిన టీడీపీ కార్యకర్త పవన్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు సచివాలయంలో ఇన్‌చార్జ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చింతాడ ప్రవీణ్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బుధవారం దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై బాధితుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా సచివాలయంలో రైతులకు యాంత్రీకరణ పనిముట్లు అందజేసేందుకు జాబితా సిద్ధం చేస్తుండగా, గ్రామానికి చెందిన సిరుగుడి పవన్ వచ్చి తనను దూషించాడని తెలిపారు. ఆ వ్యక్తికి దుక్కి సెట్ మంజూరు కాగా రొటోవేటర్‌కు ఎందుకు పెట్టలేదని తగాదాకు దిగాడన్నారు. చెప్పలేని బూతులతో తనపై దాడికి దిగాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. మొదట అగ్రికల్చర్ అసిస్టెంటే తనను విమర్శిస్తూ మాట్లాడారని టీడీపీ కార్యకర్త పవన్ తెలిపాడు. కాగా టీడీపీ కార్యకర్తపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు అగ్రికల్చర్ అసిస్టెంట్ సిద్ధమవుతుండగా..స్థానిక టీడీపీ నేతలు ఇద్దరి మధ్య రాజీ కుదర్చడంతో సమస్య సద్దుమణిగింది.

నేడు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ

గజపతినగరం: స్థానిక శ్రీవాసవి కల్యాణ మండపంలో గురువారం ప్రపంచ ఆర్య వైశ్యమహాసభ నిర్వహించనున్నట్లు ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది పండగ నేపథ్యంలో ముందస్తుగా మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఏపీ వైశ్యకార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు, గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ, ఎస్ఐ కె.లక్ష్మణరావు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే మహాసభకు జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్య సంఘాల పెద్దలు, వైశ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ. జగన్ మోహనరావు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమంటే కార్మికులకు తీరని ద్రోహం చేసినట్లేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని కార్మికులు, ప్రజలు ఆశించారని.. కాని అందుకు భిన్నంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 6న జరిగిన కేబినెట్ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు పత్రికల్లో వచ్చిన వార్తలతో కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకుని కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, తదితర సౌకర్యాలు పక్కాగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మార్చి 26 నుంచి సంతకాల సేకరణ, ఏప్రిల్ 1న మున్సిపల్, పట్టణ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు ఏప్రిల్ పదో తేదీన మున్సిపల్ శాఖా మంత్రి పి. నారాయణకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు బి. భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కె. ఆదినారాయణ, బాబూరావు, దుర్గారావు, హరిబాబు, నారాయణరావు, రాఘవ, భాస్కరరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు.. ప్రత్యేక పూజలు

జిల్లా కేంద్రంలోని మంగలవీధిలో కొలువైన నూకాలమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 67వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. భక్తులు వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


ఆలయ ముఖద్వారం


పూజలందుకుంటున్న నూకాలమ్మ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


ఆలయ ప్రాంతంలో విద్యుత్ కాంతులు

రక్తదాన శిబిరం


కొవ్వాడలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూలైఫ్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు కోట్ల రఘు, చందక సత్యం, సోమాదుల సాంబాబు, సురేష్, తదితరులు పాల్గొన్నారు. – పూసపాటిరేగ

వడ్డీ రాయితీ సద్వినియోగం చేసుకోండి..


నగర పంచాయతీ ప్రజలు పన్ను వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కె. అప్పలరాజు కోరారు. ఈ మేరకు ప్రచార వాహనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 31లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, సచివాలయం అడ్మిన్ లీలాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. – నెల్లిమర్ల

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు


అంబటివలస వద్ద జాతీయ రహదారి-26ను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యరెడ్డి

బొండపల్లి: మండల పరిధిలోని జాతీయ రహదారి–26పై తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వీటి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి స్థానిక పోలీస్ అధికారులకు సూచించారు. మండలంలోని బోడసింగిపేట ,అంబటివలస, గొట్లాం గ్రామాల్లో బైపాస్, జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బుధవారం సాయంత్రం పరిశీలించారు. అంబటివలస వద్ద రోడ్డు కుంగిపోయి ఎత్తు పల్లాలు ఉండడం వల్ల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఎస్ఐ యు.మహేష్ డీఎస్పీకి వివరించారు.తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్టాపర్లు, వేగనిరోధకాలు ఇప్పటికే ఏర్పాటు చేసినప్పటికీ మరిన్ని చోట్ల వాటిని ఏర్పాటు చేయాలని ఎస్ఐని డీఎస్పీ ఆదేశించారు. డీఎస్పీ వెంట గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బైపాస్ పేరుతో మాపొట్ట కొట్టొద్దు


రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న వీఆర్‌ఓలు కన్నయ్య, రమణ

- నిర్వాసిత రైతుల వేడుకోలు
- విచారణలో గళమెత్తిన రైతులు

శృంగవరపుకోట: విశాఖపట్నం–అరుకు మార్గంలో ఎస్.కోట మీదుగా అభివృద్ధి చేయనున్న జాతీయరహదారి– 516బీలో బైపాస్ రోడ్డు నిర్మాణంతో తమ పొట్ట కొట్టొద్దు అంటూ నిర్వాసిత రైతులు వేడుకున్నారు. జాతీయరహదారి– 516బీ లో కొత్తూరు నుంచి కాపుసోంపురం వరకు చేపట్టనున్న బైపాస్ రోడ్డును స్థానిక రైతాంగం వ్యతిరేకిస్తున్న విషయం విధితమే. ఇదే విషయమై ఈనెల 17 కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఏపీ రైతు సంఘం నేతృత్వంలో రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో రైతుల అభ్యంతరాలు, ఉద్దేశాలను తెలుసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించారు. స్థానిక వీఆర్‌ఓలు కన్నయ్య, రమణ భూములు కోల్పోతు న్న నిర్వాసితులతో బుధవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ పోలవరం కాలువ కోసం ఇప్పటికే భూములు కోల్పోతున్నామని, ఇప్పుడు బైపాస్ అని భూములు లాక్కుంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎస్.కోట పట్టణం మధ్య నుంచి ఉన్న రోడ్డు 180 అడుగుల వెడల్పుతో ఉన్నట్లు రికార్డుల్లో ఉందని, కానీ వాస్తవంగా 40అడుగులు కూడా లేదన్నారు. ఆ రోడ్డునే వెడల్పు చేసి, అభివృద్ధి చేసే వీలుందని, దాన్ని వదిలేసి కోట్లు ఖర్చుచేసి కొత్త రోడ్డు వేయడమేంటని, బైపాస్‌కు భూములు ఇచ్చేస్తూ తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్డు ఎస్.కోట పట్టణాభివృద్ధికిగొడ్డలి పెట్టులా మారుతుందని, పట్టణంలో ఎంతోమంది వ్యాపారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారన్నారు. ప్రతిపాదిత బైపాస్ అనివార్యమైతే 2013 భూసేకరణచట్టం ప్రకారం పరిహారం ఇస్తూ, భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బల వంతంగా భూములను లాక్కొనే ప్రయత్నం చేస్తే ఉద్యమానికి సిద్ధమని రైతులు వీఆర్‌ఓలకు చెప్పారు. ఏపీ రైతు సంఘం ప్రతినిధి మద్దిల రమణ, రైతులు వసంత సత్యారావు, మళ్ల సత్యారావు, కొటాన సూర్యం, మంచిన రాము, పిల్లల రమణ, పాలమరశెట్టి రామకృష్ణ, పి.సూరిబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

చీపురుపల్లి: పదోతరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు చీపురుపల్లిలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ఆ కళా శాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్ బాబు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 31 వరకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఏప్రిల్ 7 నుంచే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులు ఉంటాయని తెలిపారు.